# వెర్రి గవర్రాజు

**"గవర్రాజుకి చిన్నప్పట్నుంచీ ఉంది చత్వారం. పై పళ్ళ వరస ఎత్తు, రంగుంటాడు గానీ బుగ్గలు మట్టుకి వలిచేసిన వడ్లపూడి నారింజకాయి డిప్పల్లాగుంటాయి. చెవులయితే అరిటిపువ్వు డొప్పల్లాగుంటాయి. సన్నగా తేగ తొక్కలాగ కాస్త గాలేస్తే ఎగిరిపోయేలాగుంటాడు మనిషి. ఇక మనిషిలో తత్వం విషయానికొస్తే...నిజంగా ఏదన్నా నమ్మాలేగానీ ఆ నమ్మిన దాన్ని ఇదాయికంగా పాటించి తీరతాడు. ఆ విషయంలో అంత నికార్సయిన మనిషండి గవర్రాజు" అంటాడు సత్తోరిసాయిబాబు.**

* * *

ఊళ్ళో రెడ్లకుర్రోళ్ళంతా వ్యాపారాలకి బయటూళ్ళు వెళ్ళిపోతున్నారు. కర్రోరి బాచీ పులగం చంటిరెడ్డిగారి మూడోవాడు అన్నారం కల్సి నర్సీపట్నంలో వడ్డీవ్యాపారం చేద్దావని బయల్దేరతా ఎక్కౌంట్లు రాయడానికి గవర్రాజుని కూడా తీసుకెళ్ళేరు.


నర్సీపట్నంలో ఒక ఇల్లు తీసుకున్న అన్నారం, బాచీ రావికమతం వడ్డాదీ లాంటి ఊళ్ళు తిరుగుతా వ్యాపారం చేస్తున్నారు.

బాగా సాగుతుంది, లాభాలు వస్తున్నాయి. ఇక జబ్బసత్తువుకొద్దీ కష్టపడే గవర్రాజు ఎక్కౌంట్లయితే ఉప్పూ చింతపండుతో తోమి ఎండలో బోర్లించిన ఇత్తడిగిన్నెలాగ చాలా సుబ్బరంగా ఉంటున్నాయి.

ఉన్నపళంగా చాలా ముమ్మరంగా పెరిగిపోయింది వాళ్ళ వ్యాపారం. దాంతో పాటు పదెకరాలు మామిడీ, జీడిమావిడీ కలిసిన తోట మూడేళ్ళకి కౌలుకి తీసుకున్నారు. ఆతోట పంటకూడా బాగానే ఉంది. దాంతో మనం ఎక్కడ చెయ్యి పెడితే అక్కడ బంగారం పండాల్సిందే అని గీరకి పోయిన ఆ కుర్రోళ్ళ ఆగడాలు బాగా పెరిగిపోయినియ్యి. అంతకుముందు ఎప్పుడన్నా ఒక నిబ్బు తెచ్చుకుని దాన్ని సగం సగం పంచుకుని తాగే ఆ ఇద్దరూ ఫుల్లు బాటిలు తెచ్చేసుకుని ఇంకా పొద్దుపోకముందే సీసాకాయ బిరడాలాగుతున్నారు. కుదుర్చుకున్న వంటోడితో ప్రతిరోజూ నీచుకూరలు వండించేస్తున్నారు బాచి అయితే వీటితో పాటు ఊళ్ళో ఎవరో పెళ్ళయిన ఆడమనిషితో తడికచాటు యవ్వారం సాగిస్తున్నాడు.

ఇలాగ అలవాట్లలో మునిగిపోయిన వాళ్ళిద్దరూ ఒళ్ళొంచి పని చెయ్యలేక పోతున్నారు వీళ్ల వాలకం జూసిన ఆ అప్పులుచ్చుకున్నోళ్ళు ఇక మొండికెయ్యడం మొదలెట్టేరు. ఆ ఏడాది గాలిదుమ్ములు ఎక్కువ రావడంతో బాగా పండిన మావిడి పంట పోయింది. కాపుకొచ్చిన మావిడికాయలు రాలిపోయినియ్యి.

దాంతో, ఎంత తొరగా పైకొచ్చేరో అంత తొరగా దివాళా తీసేసేరు. తిరిగి వెనక్కొస్తా మొత్తం బాకీలన్నీ గవర్రాజుకి అప్పగించి "అన్ని పారుబాకీలు వసూలైతే నువ్వు వసూలు చేసుకో మేం వెళ్తన్నాం" అని జెప్పేసి తుని స్టేషనుకొచ్చి అనపర్తిలో ఆగే రైలు బండెక్కేసి పసలపూడొచ్చేశారు.



వాళ్ళెళ్ళిపోయాక
జబ్బలు పులిసిపోయేలాగ కష్టపడ్డ గవర్రాజు
అప్పులుచ్చుకున్నోళ్ళని బతిమాలి బామాలి, అదిరించి బెదిరించి బాకీలు
వసూలు చేయగలిగేడు. వసూలైన సొమ్ము నమ్మకస్తులు అనిపించి నోళ్ళకి మళ్ళీ ఇవ్వడం
మొదలెట్టేడు.

కోడిరెక్కల కింద పిల్లల్ని దాచుకున్నట్టు వచ్చిన ఒకోరూపాయి జాగర్తగా దాస్తున్నాడు. రెండు మూడేళ్ళు గడిచినియ్యి. బాగా డబ్బున్నోడయిపోయేడు గవర్రాజు.

ఒకరోజు మా ఊళ్ళోకి దిగిన గవర్రాజుని ''శబాషురా గవర్రాజు ఆళ్ళు చెయ్యలేక పారిపోయొచ్చిన వ్యాపారాన్ని నువ్వు సక్కబెట్టేవు''అన్నారు చింతాకృష్ణగారు.

అంత పెద్ద మనిషి అలా మెచ్చుకోడం జూసి బాగా ఉబ్బిపోయి తలొంచేసుకున్నాడు గవర్రాజు.

''ఇంత తక్కువ టైము ఇంత బాగా గడించేవంటే అంతా ఆ అన్నవరం సత్యన్నారాయణమూర్తి చలవ'' అని క్రిష్ణగారంటే ''ఠాఠ్'' అంటా ఎదురు తిరిగిన గవర్రాజు 'నేనింత డబ్బు గడించడానికి కారణం ఆ దేవుడు కాదండి రెడ్డిగారూ!' అన్నాడు.

నవ్విన చింతాక్రిష్ణగారు ''నరాలుబ్బేలాగ నువ్వు పడ్డ కష్టమంటావా?'' అన్నారు.


''అది కాదండయ్యా'' అన్నాడు గవర్రాజు.

''మరి?'' బొత్తిగా అర్థం గాలేదు క్రిష్ణగారికి.

బులబులాగ్గా నవ్వేసిన గవర్రాజు ''నర్సీపట్నంలో నేనున్న ఇంటివాస్తు అంత గొప్పదండి. పెద్దోరు మీముందు చెప్పగూడదుగానీ నేనెరిగింది చెప్తున్నానండి. గొప్ప వాస్తున్న స్థలం గజం దొరికినా గొప్పోళ్ళమయిపోవచ్చండి... నిజవండి'' అనేసెళ్ళి పోయాడు గవర్రాజు.

* * *

వెలగలోరి దొడ్లో తాటాకులు లేని నాలుగు నిట్రాళ్ళపాక మీద కాకరపాదు చిక్కగా అల్లుకుపోయింది. దొడ్డి కాళ్ళ ముసల్ది తట్టలో ఏరుకున్న వరిపరకల్నేసుకుని పెద్ద వీధిలోంచి నడుచుకుంటా వెళ్ళిపోతుంది సాలోళ్ళ వీధిలో ముసలెద్దు లాగుతున్న ఒంటెద్దుబండిలో కూర్చున్న కన్నెపిల్ల తేగలో చందమామ నములుతుంది. ముంతల్ని కావిట్లో మోసుకుంటా కాలవగట్టు మీదెళ్ళిపోతున్నాడో కుర్రోడు కాలువలో జాయిగా వెళ్తున్న పడవలో కూర్చున్న ఇద్దరు ముసలోళ్ళు వల అల్లుతున్నారు. కాలవగట్టు మీదున్న ఆంజనేయస్వామి గుడి



శిఖరానికి కట్టిన లౌడు స్పీకర్లలోంచి ముమ్మరంగా వినపడే భక్తిపాటలు బస్సు గుడిని దాటి వెళ్తున్నప్పుడు స్పీకర్ల సౌండాగిపోయి అదెళ్ళేక మళ్ళీ వినిపిస్తుంది. అప్పుడే ఆగిన ఆ రాజమండ్రి బస్సులోంచి దిగిన సాయిబాబు మిలట్రీ గ్రీన్ ట్రంకు పెట్టె మోసుకుంటా కాలవగట్టు దిగి ఊళ్ళోకి నడుస్తున్నాడు.

ద్వారబంధానికి ఎడాపెడా రెండు పోలీసు బొమ్మలు నిలబడున్న నల్లమిల్లి రాజారెడ్డిగారిల్లు దాటబోతుంటే పెద్ద తట్టొచ్చేలాగ సాయిబాబు వీపు మీద ఒక్క చరుపు చరిచేడెవరో. వెనక్కి చూస్తే నవ్వుతా గవర్రాజు''ఎప్పుడొచ్చేవురా?'' అంటున్నాడు.

వాళ్ళిద్దరూ సెవెన్త్ క్లాసుదాకా చెల్లూరుస్కూల్లో చదువుకున్నారు.

''మనూరొచ్చి చాలా ఏళ్ళయిపోయింది ఎక్కడుంటున్నావ్ ఏంటి?'' లాంటి కుశలప్రశ్నలయి పోయింతర్వాత తనస్టోరీ పొడిపొడిగా చెప్పి ''మా ఇంటికోసారి రారా సాయీ'' అని తగాదా పెట్టుకునేసరికి ఆ సాయంత్రమే వెళ్ళేడు సాయిబాబు.

చాలా పెద్దిల్లు. మావూరు మొత్తానికి ఇదే పెద్దిల్లు అనిపించేలాగ కట్టేడు. సాయిబాబు జబ్బమీద చెయ్యేసి ఇల్లంతా చూపిస్తా ఇక్కడింతకు ముందు వెంపారెడ్డిగారి దూళ్ళసావిడి ఉండేది. ఈస్థలం నేనుకొని ఈశాన్యంలో శంకుస్థాపన చేయించేను. అలా చేస్తే పంచభూతాలకీ ఆహ్వానం పలకడం అన్నమాట. అంటా దొడ్లో నూతి దగ్గరకి తీసుకెళ్ళి ''ఇదిగో ఈ బావి చూడు ఇది తూర్పన్నమాట. ఇక్కడ నుయ్యి తవ్విస్తే కష్టం ఈ జన్మకి మన దగ్గరకి రాదు. పడమటివేపు ఈ ఖాళీస్థలం ఎంత వదిలేసేనో చూడు ఇలా వదిలెయ్యడం ఇంటి యాజమానికి చాలా మంచిదట. ఇప్పుడు ఇల్లు చూద్దారి లోపలికి పద... ముందు ఈ సిమ్మెంటు గోలెంలో నీళ్ళతో కాళ్ళు కడుక్కో'' అని చెంబందించేడు.

''లోపలికి అడుగెడ్తుంటే దక్షిణ ఆగ్నేయం నించి ఉత్తర ఈశాన్యానికి నడక చాలా మంచిది మనం నడిచేది ఆవేపే'' అని లోపలికి తీసుకెళ్ళేడు.

పెద్ద పెద్ద గదులు. గాలి చాలా బాగా వీస్తుంది అదే ముక్క గవర్రాజుతో అంటే... ''గదులన్నీ పడమటివేపు కొచ్చేలాగ కట్టించేన్రా పూజగది చూడు పశ్చిమంలో ఉంది. ఇక్కడ పూజచేస్తే అంతా శుభమే. అంటా ముందుకు నడిపించుకుని బాత్‌రూములు ఉత్తరంలో ఉంటేనే సుఖశాంతులుంటాయంట. రా...రా... పశ్చిమంలో వాలుగా వరండా ఉంటే ఇంటియాజమాని ఆరోగ్యానికి మంచిదంట''. అలాగ వాస్తుగురించి చెపుతా మొత్తం ఇల్లంతా తిప్పేడు. ఆ వాస్తూగీస్తూల సంగతి ఏమాత్రం తెలీని సాయిబాబుకి ఇల్లు బ్రహ్మాండంగా నచ్చింది. ఆ ముక్కే చెపితే అదంతా వాస్తు మహిమలే ఈ ఇంట్లో ఉండే ఎవడైనా కోట్లకి పడగలెత్తొచ్చు. నువ్వు మళ్ళీ వచ్చేసరికి నన్ను జూస్కో ఎలా కనిపిస్తానో అనేసి దొడ్లో దూళ్ళ సావిడిదగ్గర బొక్కు బొక్కుమని పొడుచుకు తింటున్న కోడిపుంజుని కోయించి పప్పుచారు కాయించి భోజనం పెట్టి పంపేడు.

* * *

ఆర్నెల్ల తర్వాత వాళ్ళ మావయ్య పోతే మళ్ళీ ఊళ్ళోకి రావాలొచ్చిన సాయిబాబు ఆ చావు కార్యక్రమాలన్నీ అయిపోయాక గవర్రాజు ఇంటికి బయల్దేరేడు.

శొంఠిగంథ్తం తీయించి పట్టేయించుకుంటున్నాడు గవర్రాజు.

ఇల్లు మునుపొచ్చినప్పట్లాగ లేదు. వంట గది ఉండాల్సి చోట పడగ్గది ఉంది. వరండా సగం మూసేసిఉంది. దొడ్లో బావి ఉండాల్సిన చోట మూసేసి ఇంకోచోట కొత్తగా కనిపించింది. ఇంకా చాలా మార్పులు కనిపిస్తున్నాయి. ఇల్లంతా తాపీ పనోళ్ళతో నిండిపోయుంది.

''ఏంటి గవర్రాజూ ఇదంతా?'' అంటే నుయ్యి తూర్పుకంటే ఉత్తరంలో తవ్విస్తే గొప్ప ఫలితాలిస్తుందని చెప్పేరు. నైరుతి స్థలం కొంచెం కలుపుకోడం వల్ల ఇంటినిండా కష్టాలేరా. పడగ్గది పడమటి వేపుకంటే తూర్పువేపే నయం అంటున్నారు సిద్ధాంతిగారు. స్నానాల గది ఉత్తరం కన్నా పశ్చిమంలో గొప్పదంట అలాగే తూర్పువేపు పల్లపు అరుగులు వల్ల సుఖశాంతు లుంటాయంట. అంటా చెప్పుకుంటా పోతుంటే అందమైన ఇల్లు అలా పాడుచేసేడేంటి ఈ లమ్డీకే అని లోపల్లోపలే తిట్టుకుంటా వెళ్ళిపోయేడు సాయిబాబు.

* * *

ఏడాదయ్యింది.

గాదుల్లో కెక్కి దిగబోతా నల్లగచ్చుమీద పడి సట్ట విరిగింది సాయిబాబు పెద్ద చెల్లెలికి.

ఊళ్ళోకి దిగిన తను తన బాల్యమిత్రుడు గవర్రాజు ఇంటికెళ్ళి చూడగానే నోట్లోంచి మాట పడిపోయి రాతితో చెక్కిన కోతి బొమ్మలాగుండి పోయేడు. కాస్సేపయ్యేక లోపలికెళ్ళి చూస్తే పిన్నీసుతో అరికాలులో దిగిన తుమ్మముల్లు తీసుకుంటా కనిపించేడు గవర్రాజు.

విచిత్రం.

ఆ ఇల్లు ఇల్లులాగలేదు. మొత్తవంతా కలగాపులగం అయిపోయింది. ఇంటిద్వారం పెరటివేపు మార్చేసేడు. దేవుడిగదిని పడగ్గది చేసేడు. హాలులో ఓ మూల స్టోరురూమూ ఇంకోమూల పూజరూమూ కట్టేడు. చాలా విచిత్రమైందేటంటే పైకెక్కడానికి వేసిన మెట్లకింద చేయిస్తున్నాడు వంట. మానిక చెంబులో గానుగనూనెని సోలచెంబులో పోస్తా కనిపించిన గవర్రాజు భార్య ''బాగున్నారా మరిదిగారూ?'' అని పలకరించింది.

చిన్నప్పటి చనువుతో పిడికిలి బిగించి గవర్రాజు జబ్బమీద ఓ గుద్దు గుద్ది పిచ్చదొబ్బులెట్టి ''ఏంట్రా ఇది?'' అన్నాడు.

నవ్విన గవర్రాజు ''వాస్తు'' అన్నాడు.

గవర్రాజునే చూస్తున్నాడు సాయిబాబు.

''ఔన్రా..వాస్తు... ఏంటేంటో ప్రోబ్లమ్సు, గొడవలు, తగాదాలు. వీసెడు బంగారం ఉండే మా ఆవిడి ఒంటిమీద చిన్న మెత్తు బంగారం కూడా లేదిప్పుడు. పవిటీడుకొచ్చిన మా పెద్దపిల్ల చింతా అప్పయ్యమ్మగారి అరుగు మీద టైలరు ఆదిగాడితో ఎగిరిపోయింది. మొదట్లో మాటాడాల్సిన మాట లాస్టులో మాటాడుతున్నాను. ఇంక నా వడ్డీ వ్యాపారం విషయానికొస్తే ఫుల్లులాసు. అందుకేరా ఈ మార్పులన్నీ చేస్తుంట'' అన్నాడు.

అంతా విని గవర్రాజు సైడు అదోలాగ చూస్తా వెళ్ళిపోతున్న సాయిబాబుని ఒకమూల పడుకున్న గవర్రాజు తల్లి పిల్చి ''నువ్వు సత్తోరి సాయిబాబువి గదా?'' అంది.

''అవును పెద్దీ'' అన్నాడు సాయిబాబు.

''ఇంతకీ ముందు రెండుసార్లొచ్చేవట. గవర్రాజు చెప్పేడు. మెడ్రాసులో ఉంటున్నావంట గదా?'' అనడిగింది.

''అవును ఎలాగున్నావు పెద్దీ, ఆరోగ్యం అదీ బాగుంటుందా?'' అనడిగేడు సాయిబాబు.

నిమ్మళంగా మంచం మీంచి లేచిన గవర్రాజు తల్లి వెంపర్తమ్మ ''ఏం బాగుండటం రా సాయీ... ఈ మధ్య వరసబెట్టి రోగాలే...కడుపునెప్పి వచ్చిందంటే నైరుతిమూల పడుకోవే తగ్గిపోద్ది అంటాడు. కాలు నెప్పొచ్చిందంటే వాయివ్యం మూల చతికిల బడు సరిపోద్ది అంటాడు. తలనెప్పి అంటే తూర్పు ఈశాన్యంలో ఒంగుని ఆ తర్వాత నిలబడు అంటాడు. చూడరా బాబూ...ఈ గోడ కుర్చీలు వెయ్యలేక చచ్చిపోతున్నాను...చిన్నం పెద్ద జట్కాలో కాస్త రాంపురంలో చెలికాని కమలమ్మగారి ఆస్పత్రికి తీసుకెళ్ళా బాబ్బాబూ'' అంది గవర్రాజు తల్లయిన వెంపర్తమ్మగారు.

ఇదంతా ఆడికి చెపుదామని ఇల్లంతా వెతికి బయటికొస్తే ఇంటిముందున్న సీమ చింతచెట్టుకింద నిలబడున్నాడు గవర్రాజు.

''నీతో చాలా మాటాడదావని వెతుక్కుంటా వస్తున్నాను ఏంట్రా ఈ చెట్టు కింద నిలబడ్డావ్'' అడిగేడు సాయిబాబు.

''మనతో కల్సి వ్యాపారం చెయ్యడానికి పెద్దాపురం అవతలున్న మర్లావనించి మనిషొస్తున్నాడు. అది చాలా లాభసాటి వ్యాపారం దాని గురించి మాటాడాలంటే మంచి వాస్తుగల చోటే మాటాడాలి... చూసేవు గదా...ఇంటివాస్తు ఏమాత్రం బాగోలేదు. అందుకే కొంపలోంచి బయటికొచ్చి ఈ చెట్టుకింద వాస్తు బాగుందంటే ఇక్కడ నిలబడున్నాను''అన్నాడు.

* * *